క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. భక్తులు పూజల్లోని పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు సౌత్‌ఆములూరులో మంత్రి కాకాణి పర్యటన

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం మండలంలోని సౌత్‌ఆములూరు పంచాయతీకి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ శనివారం ఉదయం 10.30 గంటలకు సౌత్‌ఆములూరు పంచాయతీలో జరిగే పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారన్నారు.

సేంద్రియ పంటలకు సినార్డ్ ప్రోత్సాహం



మాట్లాడుతున్న సినార్డ్ పీఎం ప్రవల్లిక

కొడవలూరు : సేంద్రియ ఎరువులతో సాగు చేసే పంటలకు సినార్డ్ సంస్థ తోడ్పాటునందిస్తోందని ఆ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్ ప్రవల్లిక తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళా రైతులకు సేంద్రియ పంటల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో సాగు చేసిన బియ్యం, పప్పు దినుసులు, కూరగాయలు వినియోగించడం ఎంతో ఆరోగ్యకరమన్నారు. సేంద్రియ సాగు కోసం ముందుకొచ్చిన రైతులకు సినార్డ్ సంస్థ రూ.5 వేల విలువైన విత్తనాలు లేక మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ఈసీ శోభ మాట్లాడుతూ సినార్డ్ సంస్థ అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర పంటలకు శ్రీకారం చుట్టాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి, ఆ సంస్థ మండల ఆర్గనైజర్ మనెమ్మ, ఉపాధిహామీ ఏపీఓ టి.రాజశేఖర్, సీసీ ఉదయ్‌కుమార్, మహిళా రైతులు పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై నవాబుపేట పోలీసులు దాడులు చేశారు. వివరాలు.. ఇంటి వద్దే బడ్డీ కొట్టును నిర్వహిస్తున్న నాగేంద్రనగర్‌కు చెందిన రమణయ్య కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా అనధికారికంగా మద్యం విక్రయాలను సాగిస్తున్నారు. ఈ విషయమై నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీకి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై రెహ్మాన్ తన సిబ్బందితో కలిసి బడ్డీ కొట్టుపై శుక్రవారం దాడి చేశారు. 12 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని రమణయ్యను అరెస్ట్ చేశారు.

పోలింగ్ కేంద్రాలను నిశితంగా పరిశీలించండి

నెల్లూరు(దర్గామిట్ట): సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను నిశితంగా పరిశీలించి అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించి పలు సూచనలు చేశారు. కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో లవన్న, ఈఆర్వోలు బాపిరెడ్డి, చిన్న ఓబులేసు, ప్రేమ్‌కుమార్, శీనానాయక్, మల్లోల, మధులత తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలితో పాటు విటుడ్ని అరెస్ట్ చేశారు. వివరాలు.. హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన వనిజ కొంతకాలం క్రితం నగరానికి వచ్చారు. శ్రీహరినగర్ నాలుగో వీధిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని వివిధ ప్రాంతాల నుంచి సెక్స్‌వర్కర్లను తీసుకొచ్చి వ్యభిచార గృహాన్ని నిర్వహించసాగారు. దీనిపై బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ వీరానాయక్‌కు పక్కా సమాచారం అందింది. తన సిబ్బందితో కలిసి దాడి చేసి నిర్వాహకురాలితో పాటు నవలాకులగార్డెన్స్‌కు చెందిన లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

- గ్రామాల్లో క్రీడా సంబరాలు

పొదలకూరు : మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారం జరిగాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బిరదవోలు, ఆర్‌వైపాళెం సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు క్రికెట్ ఆడారు. ఆర్‌వైపాళెం, అంకుపల్లి టీమ్‌ల మధ్య పోటీ నిర్వహించగా ఆర్‌వైపాళెం విజయం సాధించింది. తొలుత క్రీడాకారులను పొదలకూరు ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కె.సనత్‌కుమార్ పరిచయం చేసుకున్నారు.

ఉత్సాహంగా..

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మిక్కిలింపేట, యల్లాయపాళెం 1, 2 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తోందన్నారు. పోటీల పట్ల గ్రామాల్లోని క్రీడాకారులు ఆసక్తి కనబరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎన్.అంకయ్య, హెచ్‌ఎం మోహన రామలింగయ్య, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాటిపర్తి భాస్కర్, ఎస్కే మహబూబ్‌బాషా, పంచాయతీ కార్యదర్శి శీనయ్య పాల్గొన్నారు.



కొడవలూరు : కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

ముగిసిన పోటీలు

మనుబోలు : ఆడుదాం ఆంధ్రాలో భాగంగా సచివాలయ స్థాయిలో ఈనెల 26 నుంచి జరుగుతున్న క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మండల వ్యాప్తంగా మొత్తం 125 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. క్రికెట్‌లో 32, ఖోఖో 13, వాలీబాల్ 17, కబడ్డీ 24, మరికొన్ని టీమ్‌లు ఇతర క్రీడల్లో పాల్గొని ఆడారు. ఇందులో బెస్ట్ ప్లేయర్స్‌ను ఎంపిక చేసి మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంఈఓ శేషాద్రివాసు, ఈఓపీఆర్డీ కృష్ణవేణి, పీడీలు ప్రమీలరాణి, సరిత పాల్గొన్నారు.



కొడవలూరు : వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు



మనుబోలు : ఖోఖో ఆడుతన్న విద్యార్థినులు



పొదలకూరు : క్రీడాకారులతో అధికారులు, నాయకులు

గాజులవారివీధిలో సీసీరోడ్డు నిర్మాణం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డు గాజులవారివీధిలో శుక్రవారం సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఏళ్లుగా స్థానికులు రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక కౌన్సిలర్ ప్రమీలమ్మ ఈ సమస్యను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురి డిబార్

వెంకటాచలం : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. మొత్తం 535 మంది విద్యార్థులకు 486 మంది హాజరు కాగా 49 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, చంద్రారెడ్డి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని వివరించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామంలో శుక్రవారం 250 మంది రైతులకు రైతువారీ పట్టాలను ఎమ్మెల్యే ప్రసన్న శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 22ఏ కింద 35 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి రైతుల కళ్లలో వెలుగులు నింపిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇప్పటికే నియోజకవర్గంలో అసైన్డ్ భూములకు సంబంధించి 274 మందికి పట్టాల రూపంలో పంపిణీ చేశామన్నారు.

పగటి వేషగాళ్లతో జాగ్రత్త

ఈ నాలుగున్నరేళ్లు కనబడని పగటి వేషగాళ్లు ప్రస్తుతం వస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే ప్రసన్న సూచించారు. కరోనా సమయంలో ఈ ప్రతిపక్ష పార్టీ నేతలు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఎవరైతే కష్టకాలంలో అండగా నిలిచారో ప్రజలు గుర్తించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, సర్పంచ్ శ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల సేవా అధ్యక్షుడు రాజుల మల్లికార్జునరావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్లు, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, డీటీ ఇలియాజ్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కామాక్షితాయి సేవలో..



అమ్మవారిని దర్శించుకున్న బెంగళూరు నేషనల్ కళాశాల విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అలాగే బెంగళూరు నేషనల్ కాలేజీకి చెందిన సుమారు రెండు వందల మంది విద్యార్థులు కామాక్షితాయిని దర్శించుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంత్రిని కలిసిన ముస్లింలు

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో పొదలకూరు ముస్లిం మతపెద్దలు గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణానికి చెందిన అంజాద్‌కు వైఎస్సార్‌సీపీ మైనారిటీ జిల్లా జనరల్ సెక్రటరీగా పదవి లభించేందుకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజాద్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధిగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో ముస్తాక్‌మాదనీ, నన్నేసాహెబ్, పలు గ్రామాలకు చెందిన మతపెద్దలు పాల్గొన్నారు.



ముస్లిం మతపెద్దలతో మంత్రి కాకాణి

గ్రామసభలు నిర్వహించండి

మనుబోలు : ఉపాధి పనుల కోసం గ్రామసభలు నిర్వహించి రైతులకు అవసరమైన పనులను ఎంపిక చేయాలని క్లస్టర్ ఏపీడీ శ్రీహరిరెడ్డి సిబ్బందికి సూచించారు. మండలంలోని కొలనకుదురు, కట్టువపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామసభల్లో ఆమోదించిన పనులను చేపట్టాలన్నారు. ఉపాధి కూలీల నగదు వారి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాజమ్మ, టీఏలు సుప్రజ, గుర్రప్ప పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో సమావేశమైన ఏపీడీ శ్రీహరిరెడ్డి

క్రీడా దుస్తుల పంపిణీ

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెంలో శుక్రవారం జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో కబడ్డీ బాలికల విభాగంలో పెమ్మారెడ్డిపాళెం నుంచి పాల్గొన్న జట్టుకు సర్పంచ్ వల్లాపురం నవీన్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం నుంచి బాలికలు ఎంతో ఉత్సాహంతో ముందుకొచ్చి పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతాటి సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు బత్తల మధుసూధన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోవూరు (బుచ్చిరెడ్డిపాలెం) : వివిధ అనారోగ్య సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరికీ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. దామరమడుగు పల్లిపాళేనికి చెందిన గండవరపు జయమ్మకు రూ.6 లక్షలు, బుచ్చిరెడ్డిపాళెంలోని ఖాజానగర్‌కు చెందిన షేక్ ఖాదర్‌బాషాకు రూ.2.60 లక్షల చెక్కులను అందజేశారు. వీరి వెంట బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : పట్టణంతో పాటు మండలంలోని పార్లపల్లి, చెర్లోపల్లి గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కామాక్షితాయికి విశేష పూజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు జరిగాయి. తొలుత స్వామి, అమ్మవారికి మహన్యాస, నవావరణ పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు కల్యాణ ఘట్టాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- టైలర్స్ కాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్ల మార్పు
- విద్యుత్ స్తంభాల నిర్మాణం
- గడప గడపలో సమస్య గుర్తించి పరిష్కారం

పొదలకూరు : నాలుగు దశాబ్దాల సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం లభించింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి వచ్చిన విద్యుత్ లైన్ల సమస్యకు సకాలంలో పరిష్కారం చూపారు. పట్టణంలోని నెల్లూరు మార్గం టైలర్స్‌కాలనీ మీదుగా నాలుగు దశాబ్దాల నుంచి 11 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. ఈ లైన్లు అత్యంత ప్రమాదకరంగా మారి ఇళ్ల నుంచి బయటకు వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు తీగలు తగిలి ఒకరిద్దరు ప్రాణాలు విడిచిన సందర్భాలు ఉన్నాయి. ఈ సమస్యను గతంలో ఎందరో నాయకులకు వివరించినా ఫలితం దక్కలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. దీంతో గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభించాయి. ఈ నేపథ్యంలో టైలర్స్ కాలనీలో సమస్యను స్థానిక ఒకటో వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్ మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పెండింగ్‌లో ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.

శాశ్వతంగా..

మంత్రి కాకాణి దృష్టికి సమస్య వెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి శాశ్వత పరిష్కారంలో భాగంగా విద్యుత్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను మార్చి మరో మార్గం గుండా నిర్మించాల్సిందిగా ఆదేశించారు. ఇందుకు సంబంధించి పేద ప్రజల వద్ద ఒక్క రూపాయి కూడా వసూలు చేయాల్సిన అవసరం లేదన్నారు. సుమారు 100 ఇళ్లకు సంబంధించిన సమస్య కావడంతో అధికారులు సైతం స్పందించి పాత విద్యుత్ స్తంభాలను మార్చి ఇళ్లపై విద్యుత్ లైన్లు లేకుండా మరమ్మతులు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో పనులు కూడా పూర్తవుతాయని విద్యుత్ ఏఈ శ్రీకాంత్ వెల్లడించారు. మెయిన్‌రోడ్డుకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా తొలగించి దూరంగా ఏర్పాటు చేస్తామన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతానికి స్థానికులు చేరుకుని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు.



స్తంభాలను మార్చిన ప్రాంతంలో సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఇళ్ల మీదుగా ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు

అన్నిరంగాల్లో అభివృద్ధి

కోవూరు : నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రధాన ఆశయమని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరులోని పాటూరు ప్రాంతంలో ఉన్న కలుజు వద్ద రూ.2.45 కోట్లతో హైలెవల్ బ్రిడ్జికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా ఏళ్లుగా పాటూరు, గమ్మళ్లదిబ్బ, దామరమడుగు, బుచ్చి వైపు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో కలెక్టర్‌తో చర్చించి నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 20వ తేదీలోగా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తవుతాయని తెలియజేశారు.

రూ.7.50 లక్షలతో ఆర్వో ప్లాంట్

కోవూరు పంచాయతీ పరిధిలోని చెర్లో గాంధీ సంఘం ప్రాంతంలో ఎంపీ విజయసాయిరెడ్డి నిధుల నుంచి మంజూరైన రూ.7.50 లక్షలతో ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రసన్న ప్రారంభించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ టి.పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

12 వరకు గడువు పొడిగింపు

మనుబోలు : ఓటర్ల జాబితా సవరణ గడువును జనవరి 12వ తేదీ వరకు ఎన్నికల సంఘం పొడిగించినట్లు స్పెషల్ కలెక్టర్ ఓబులేసు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా సంసిద్ధతపై బీఎల్వోలు, వీఆర్వోలు, వీఆర్‌ఏలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరినీ ఓటర్ల జాబితాలో చేర్చేందుకు, మార్పు చేర్పులకు మరో అవకాశం వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో వీఆర్‌ఏల సాయంతో మరణించిన వారి వివరాలతో పాటు డబుల్ ఎంట్రీలను గుర్తించి తొలగించాలన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ శివకృష్ణయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ ఓబులేసు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పొదలకూరు : మండలంలోని ఉలవరపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇన్‌చార్జి ఎస్సై మస్తానయ్య కథనం మేరకు.. గ్రామానికి చెందిన కృష్ణంనాయుడు(57) హైదరాబాద్‌లో నివాసం ఉంటూ తరచుగా స్వగ్రామానికి వస్తుంటారు. ఈ క్రమంలో రాత్రి పట్టణంలోని సంగంరోడ్డు సెంటర్ నుంచి గ్రామానికి స్కూటీపై వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పట్టణంలోని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.